కురవి: సీరోలు ఎస్సై నగేశ్‌ను శాలువాతో సత్కరించి అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

విపత్కర పరిస్థితుల్లో పోలీసుల సేవలు భేష్

- మహబూబాబాద్ జిల్లా పోలీసులకు సీఎం కితాబు
- సీరోల్ ఎస్సై నగేశ్‌ను అభినంధించిన ముఖ్యమంత్రి

కురవి, సెప్టెంబర్ 3: ప్రకృతి విలయతాండవం చేసి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసిన విపత్కర పరిస్థితుల్లో మహబూబాబాద్ జిల్లా పోలీసుల సేవలు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ప్రాణాలకు తెగించి మరిపెడ మండలం సీతారాంతండా వాసులను కాపాడిన సీరోలు ఎస్సై నగేశ్‌ను కలెక్టరేట్‌లో శాలువతో సత్కరించి అభినందించారు. సీతారాంతండాను వరద ముంచెత్తిన సమయంలో సమాచారం అందుకున్న ఎస్సై నగేశ్ తన సిబ్బందితో వెళ్లి ప్రజలను ఎత్తయిన ప్రదేశంలోకి తరలించడంతోపాటు ఓ వృద్ధురాలిని స్వయంగా జోలె కట్టి ఎత్తుకొని వెళ్లి కాపాడారు. ఎస్సై నగేశ్‌ను నమస్తే తెలంగాణ సంప్రదించగా...సీతారాంతండాను చూసిన సమయంలో మనసు మనసులో లేదు. తండావాసులు డాబాలమీదకు ఎక్కి పది గంటలకు పైగా వర్షంలో బిక్కుబిక్కుమంటూ గడిపారు. రెస్క్యూటీం, తండావాసులతో కలిసి తోచిన సాయం చేశాను. అందరి సాయంతో తండావాసులను సురక్షిత ప్రాంతానికి తరలించాం. నడిచే పరిస్థితుల్లో లేని ద్వాలీ(వృద్ధురాలు)ని సురక్షిత ప్రాంతానికి చేరవేసేందుకు జోలెను కట్టాం. ఆ వృద్ధురాలిని సురక్షిత ప్రాంతానికి చేరవేయడంతో అంతసేపు పడిన కష్టం మాయమైంది. సీఎం ద్వారా అభినందనలు స్వీకరించడం ఆనందంగా ఉంది.

మైనార్టీ గురుకులంలో షార్ట్ సర్క్యూట్

- పలువురు తల్లిదండ్రుల ఆరోపణ
- వాస్తవం కాదని తేల్చిన ఎంపీడీవో వేణుమాధవ్

తొర్రూరు, సెప్టెంబర్ 3 : డివిజన్ కేంద్రంలోని మైనార్టీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రెండు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్ జరిగినట్లు కొంత మంది తల్లిదండ్రులు ఆరోపించిన ఘటన మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో స్పందించిన కలెక్టర్ ఆదేశాలతో తొర్రూరు ఎంపీడీవో వేణుమాధవ్ మంగళవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు, సిబ్బందిని విచారణ చేపట్టారు. పాఠశాలలో రెండు రోజుల క్రితం కరెంటు సరఫరా నిలిచిపోయిందని కొందరు తల్లిదండ్రులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, అసలు ఆ సమయంలో కరెంటు లేదని తేల్చి చెప్పారు. కాగా, విచారణ సమయంలో ప్రిన్సిపాల్ అందుబాటులో లేనట్లు సమాచారం.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కేసముద్రం, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలతో సర్వస్వం కోల్పోయిన వరద బాధితులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. సుమారు 150 మంది బాధితులకు బియ్యం, పుప్పు, నూనె, కూరగాయలు అందజేశారు. ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన బాదావత్ వాణి మృతి చెందగా, ఆమె కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు వీరన్నయాదవ్ 50 కిలోల బియ్యం అందజేశారు. అలాగే ఇల్లు నీటమునిగి సర్వస్వ కోల్పోయిన మంగీలాల్ కుటుంబానికి ఆయన చిన్ననాటి స్నేహితులు మంగళవారం 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ధర్మారం జీపీ శివారు సీతారాంతండాకు చెందిన మంగీలాల్ ఇల్లు వర్షాలకు నీట మునిగింది. ఆయన చిన్ననాటి స్నేహితులు మంగళవారం 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

ఇంట్లో నుంచి వెళ్లిపోయిన నిండు గర్భిణి

మమత

గూడూరు, సెప్టెంబర్ 3: తాగుడుకు బానిసైన భర్త వేధింపులు తట్టుకోలేక నిండు గర్భిణి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. భూపతిపేట గ్రామానికి చెందిన బైరి మమత అనే తొమ్మిది నెలల నిండు గర్భిణితో భర్త ఎల్ల స్వామి ప్రతిరోజూ తాగొచ్చి గొడవ పడేవాడు. అతడి వేధింపులు భరించలేక అదే గ్రామంలో తన తల్లి సుంకరి యాకమ్మ ఇంట్లో ఉంటున్నది. ఈ క్రమంలో హెల్త్‌చెకప్ చేయించుకోగా, కడుపులో బిడ్డ కూడా ఆరోగ్యం గాలేదని వైద్యులు తెలిపారు. దీంతో మనోవేదనకు గురైన మమత ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. గ్రామంలో, తెలిసిన వారి ఇండ్లలో వెతికినా జాడ తెలియకపోవంతో తల్లి యాకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సహాయక చర్యల్లో సర్కారు విఫలం

- వరద బాధితలను ఆదుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫెయిల్..
- ముంపు జరిగి మూడు రోజులవుతున్నా సహాయక చర్యలు శూన్యం
- బాధితులకు తక్షణ సాయం ప్రకటించండి
- మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్
- బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డితో కలిసి రావిరాల గ్రామంలో పర్యటన

తెగిన రావిరాల చెరువును, ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి, నాయకులు

నెల్లికుదురు, సెప్టెంబర్ 3 : వరద బాధితులను ఆదుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జలదిగ్బంధంలో చిక్కుకొని అల్లకల్లోలమైన రావిరాల గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డితో కలిసి ఆయన మంగళవారం పర్యటించారు. బాధితుల ఇండ్లకు వెళ్లి పరామర్శించారు. జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. సర్కారు సహాయక చర్యలపై ఆరా తీశారు. 'అధైర్యపడొద్దు.. మేము అండగా ఉంటాం.. మా వంతు సాయం చేయడంతోపాటు సర్కారు మెడలు వంచి సాయం చేయిస్తాం' అని భరోసానిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరద బీభత్సం ప్రజలకు కన్నీళ్లను మిగిల్చిందన్నారు. 80 నుంచి 90 ఇండ్లు ధ్వంసమయ్యాయని, సుమారుగా 95 గొర్రెలు నీటి వరదలో కొట్టుకపోయాయని, బైక్‌లు, ఆటో, ట్రాక్టర్లు, నిత్యావసర సరుకులు, నిల్వచేసుకున్న వస్తువులు, బియ్యం సహా మొత్తం వరదలో కొట్టుకుపోయాయన్నారు. ఒక రోజు మొత్తం ప్రజలు బిక్కుబిక్కు మంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడపడం హృదయాలు చలించే ఘటన అని అన్నారు. గ్రామంలోని ప్రజలకు కట్టుబట్టలు తప్ప మిగిలిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఆర్థిక సాయం చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్ర మంత్రి సీతక్క వచ్చి కూడా తక్షణ సాయంగా ప్రకటించకపోవడం దారుణమన్నారు. చెరువు కట్టలు పూర్తి తెగిపోయి నీళ్లు లేకుండా పోయాయని, ఈ సీజన్‌లో పంటలు పండడం కష్టమేనన్నారు. పాలకులు ఫొటోలకు ఫోజులిచ్చేడే తప్పా చేసింది మాత్రం శూన్యమన్నారు. ఇలాంటి విపత్కర ఘటనల సమయంలో నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సేవలు, ఇప్పుడు పాలక ప్రభుత్వం చేస్తున్న సాయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి బాధితలకు తక్షణ సాయంగా కొంత ఆర్థిసాయం అందజేయాలని, ఇండ్లు కూలీపోయిన వారందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చెరువులను పునరుద్ధరించి తక్షణమే రైతులకు వినియోగంలోకి తేవాలని, ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అనిల్, కొమ్ము అనిల్, మండల మాజీ అధ్యక్షుడు ఆకుల జగ్గయ్య, నాయకులు పులి రామచంద్రు, కుమార్, ఎండీ షరీఫ్, బిక్కునాయక్, మాదరి ప్రశాంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పాకాల ఏరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలి

గార్ల, సెప్టెంబర్ 3: పాకాల ఏరుపూ హై లెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లా కారెపల్లి మండలం గంగారంతండాకు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి వచ్చిన ఆయనకు హై లెవల్ వంతెన విషయాన్ని వివరించారు. వంతెన లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను నరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన నరేందర్‌రెడ్డి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో విషయాన్ని సీఎంకు వివరించి, నిధుల విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు దుర్గాప్రసాద్ తెలిపారు.

హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం ఆందోళన

పాకాల ఏరుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏరు వద్ద సీపీఎం నాయకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముంపు ప్రాంతాల్లో పర్యటించేందుకు జిల్లాకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి యుద్ధ ప్రాతిపదికన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు.

దెబ్బ తిన్న రోడ్లను పరిశీలించిన రెడ్యా

చిన్నగూడూరు, సెప్టెంబర్ 3 : మండలకేంద్రం శివారులో ఆకేరు ఉధృతిని, తెగిపోయిన రోడ్డును డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్షణమే రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కొమురెల్లి, ఆయూబ్‌పాషా, సత్యం, శ్రీను, మల్లయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

సీతారాంతండా వాసులకు నిత్యావసరాల పంపిణీ

మరిపెడ సెప్టెంబర్ 3 : సీతారాంతండా ముంపునకు గురైన 40 కుటుంబాలకు మాజీ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరద బీభత్సంతో నష్టపోయిన కుటుంబాలు ధైర్యంగా ఉండాలని తాము అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుగులోత్ వెంకన్న, తేజావత్ రవీందర్, ముత్యం వెంకన్న, మహబూబ్‌పాషా, రణధీర్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మాజీ ఎంపీ కవిత

బంధం చెరువు తెగడానికి కారకులను శిక్షించాలి

తహసీల్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

నర్సింహులపేట, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని బంధం చెరువు కట్ట తెగిపోవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నర్సింహులపేటలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయకట్టు రైతులు ధర్నా చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. గతేడాది బంధం చెరువుకు ప్రమాదం పొంచి ఉండడంతో రైతులందరం కలిసి ఇసుక బస్తాలు వేసుకున్నామన్నారు. ఈ ఏడాది చేప పిల్లల పెంపకం కోసం ఇరువైపులా మత్తడి వద్ద ఇసుప జాలీ ఏర్పాటు చేయడంతో చెత్తాచెదారం జాలీకి తట్టుకొని చెరువులో నీరు ఎక్కువై తెగిపోయిందన్నారు. ఇసుప జాలీ ఏర్పాటు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏవో వినయ్‌కుమార్‌కు వినతి పత్రం అందిజేశారు. నవీన్, బక్కయ్య, పూల్లారెడ్డి, కల్పన, రాములు, భిక్షం, సోమిరెడ్డి, శ్రీనివాస్, రమేశ్, సుదర్శన్, మహినొద్దీన్, వెంకన్న, వెంకటేశ్ పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సీఎం సహాయ నిధికి విరాళం

తొర్రూరు, సెప్టెంబర్ 3: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వరద బాధితుల సహాయార్థం మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఫౌండర్ సిరికొండ విక్రమ్‌కుమార్ సంస్థ ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5వేల విరాళం అందజేశారు. చెక్కును మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు అందజేశారు.

ముఖ్యమంత్రికి వినతి

డోర్నకల్, సెప్టెంబర్ 3: మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం ఆకేరు వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డి డోర్నకల్ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కాంగ్రెస్ నాయకులను చూసి కాన్వాయ్‌ని ఆపారు. వాహనం నుంచి బయటకు వచ్చిన ఆయనకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. డోర్నకల్ మున్సిపాలిటీని మేజర్ గ్రామపంచాయతీగా మార్చాలని, ఇంటర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఆక్రమణకు గురైన బంధం చెరువు కాపాడాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలని వినతి

దంతాలపల్లి, సెప్టెంబర్ 3 : చెరువులో అక్రమ కట్టడాలను తొలగించాలని కోరుతూ మంగళవారం మండలంలోని కుమ్మరికుంట్లకు చెందిన రైతులు ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో వివేక్‌రామ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఈనకుంట చెరువులో నిదానపురం గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు చెరువు మత్తడి ముందు ఇనుప జాలీలు ఏర్పాటు చేయడంతో చెత్తాచెదారం చిక్కుకొని నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదని, వెంటనే వాటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రంలో రైతులు లింగయ్య, సోమయ్య, వీరయ్య, రాములు, ఎల్లయ్య, వెంకన్న, శ్రీను, గౌరయ్య, వెంకటయ్య ఉమేశ్, రమేశ్, యాకయ్య, రవి, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

బెంచ్‌ప్రెస్ చాంపియన్‌షిప్‌లో హమీద్‌కు ప్రథమస్థానం

డోర్నకల్, సెప్టెంబర్ 3: మేడ్చల్ జిల్లా బాలానగర్, రాజు కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో డోర్నకల్ భారత్ వీర్ వ్యాయామశాలకు చెందిన హమీద్ 107.5 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు. అక్టోబర్ 14న గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

2,700 ఎకరాల్లో పంట నష్టం : ఏవో

నర్సింహులపేట/బయ్యారం/ కురవి(సీరోలు), సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని బంధం చెరువు ఆయకట్టు వరి పొలాలను మంగళవారం ఏవో వినయ్‌కుమార్ పరిశీలించారు. మండలంలో 2వేల ఎకరాల్లో వరి, 700 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగిందన్నారు. ఏఈవోలు క్షేత్రస్థాయి పర్యటిస్తూ పంటనష్టం అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో వరి, మక్కజొన్న, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు. అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులు అప్రమత్తంగా ఉండాలని సీరోలు ఏవో చాయారాజ్ సూచించారు. కొర్లకుంటతండా చెరువుకు గండి పడడంతో నష్టపోయిన రైతుల పంట పొలాలను ఆయన పరిశీలించారు.

నీటి మునిగిన 5 వేల కోళ్లు

బాధిత రైతుకు రూ.15లక్షల నష్టం

నెల్లికుదురు, సెప్టెంబర్ 3 : మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన చిన్నబోయిన సతీశ్ కోళ్ల ఫాంలోకి వరద పోటెత్తింది సుమారు 5వేల కోళ్లు కొట్టుకపోయాయి. దాణా మొత్తం తడిసి ముద్దయిపోయింది. మొత్తం రూ.15 లక్షల నష్టం వాటిల్లినట్లు సతీశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తక్షణ సహాయం అందించడంలో ప్రభుత్వం విఫలం

నెల్లికుదురు, సెప్టెంబర్ 3 : రావిరాల గ్రామంలో పర్యటించిన మంత్రి సీతక్క తక్షణ సాయం కింద నిధులు మంజూరు చేయకపోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మదన్ అన్నారు. మంగళవారంఆయన రావిరాల గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి సీతక్క గ్రామంలో పర్యటించి గ్రామానికి ఒక్క రూపాయి కూడా ప్రకటించకుండా వెళ్లడం సరి కాదన్నారు. ఉండేందుకు ఇండ్లు లేక, తినేందుకు తిండ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేవలం పట్టణ ప్రాంతాల్లో మాత్రమే పర్యటించడం సిగ్గుచేటుని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే రావిరాల గ్రామానికి వెంటనే రూ.10కోట్ల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఫ్యామిలీ గ్రూప్ సర్వేకు రైతులు సహకరించాలి

పెద్దవంగర, సెప్టెంబర్ 3: రుణ మాఫీ కోసం రైతులు ఫ్యామిలీ గ్రూప్ ఫొటో అప్‌లోడ్ సర్వేకు సహకరించాలని ఏవో స్వామి కోరారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని రైతు వేదికలో మాట్లాడుతూ.. రుణ మాఫీ కానీ రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కోసం సహకరించాలని కోరారు. మండల 313 మంది రైతులు రుణమాఫీ ఫ్యామిలీ గ్రూపునకు అర్హులని, ఇప్పటికే 127మంది రైతుల కుటుంబ సభ్యుల వివరాలను సమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు యశస్విని, రాజు, విశ్వశాంతి పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్ కోసం ఆపిన ఆర్టీసీ బస్సులు, వాహనాలు

సీఎం కాన్వాయ్ కోసం గంటపాటు ఆపిన ఆర్టీసీ బస్సులు

ఇబ్బందిపడ్డ ప్రయాణికులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 3 : జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఖమ్మం జిల్లా కారేపల్లిలో వరద బాధితులను పరామర్శించిన అనంతరం జిల్లాకు బయలుదేరారు. సీఎం కాన్వాయ్ వస్తుండడంతో పట్టణ శివారులో సాలార్‌తండా క్రాస్‌రోడ్డు వద్ద ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనదారులను పోలీసులు నిలిపివేశారు. సుమారు గంటపాటు ఆపడంతో బస్సులోని ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. అర్జెంట్‌గా వెళ్లాలని పోలీసులను వేడుకున్నా కనుకరించలేదు.

వరదలతో నష్టపోయిన వారిని ఆదుకుంటాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్ : వరదల కారణంగా నష్టపోయిన వారిని ఆదుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో రివ్యూ నిర్వహించిన అనంతరం మంత్రి సీతక్కతో కలిసి ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి అతిభారీ వర్షాలు కురిసి ప్రజలు ఇబ్బందిపడ్డారని అన్నారు. మరిపెడ మండలం సీతారాంతండాలో ముంపు ప్రాంతాలను పరిశీలించామని, ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. వరదల్లో చిక్కుకున్న 1700 మందిని పోలీసులు, రెస్క్యూటీంలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. విపత్తులు జరిగినప్పుడు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వరదల జరిగిన ప్రాణ, ఆస్తి, రోడ్లు, పంట నష్టం వివరాలను అధికారులు పూర్తిస్థాయిలో సేకరించాలన్నారు. ములుగు జిల్లాలో ముందస్తుగా వర్షాలకు సంబంధించిన ప్లాన్ సిద్ధం చేసి ముందస్తుగా చర్యలు తీసుకున్నామన్నారు. వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండి చేయూతనివ్వాలన్నారు.

హరీశ్‌రావు బృందంపై దాడిని ఖండిస్తున్నాం

గూడూరు, సెప్టెంబర్ 3 : వరద బాధితులను ఆదుకోవడానికి వెళ్లిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బృందంపై దాడి చేయడం హేయమైన చర్య, దీనిని ఖండిస్తున్నామని ఎన్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు బానోత్ రామన్ననాయక్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో వర్షానికి నిరాశ్రయులై సాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేల కార్లపై దాడి చేయడం పిరికి చర్య అని, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడి అప్రజాస్వామికం

బయ్యారం: ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడి అప్రజాస్వామికమని మండల అధ్యక్షుడు తాత గణేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. వరద బాధితులకు పరామర్శించేందుకు ఖమ్మంలో పర్యటిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, నాయకుడు నామానాగేశ్వరావుపై కాంగ్రెస్ గూండాల దాడి దుర్మార్గమన్నారు. బాధితులకు సహాయం చేయలేక ప్రజలకు ధైర్యం చెప్పేందుకు వెళ్తున్న తన నాయకులపై దాడిచేయడం సిగ్గుమాలిన పని అన్నారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పలని డిమాండ్ చేశారు.

వరదలో చిక్కుకున్న మహిళ మృతి

కేసముద్రం, సెప్టెంబర్ 2: కేసముద్రం విలేజ్ ఎన్టీఆర్‌నగర్ కాలనీకి చెందిన బదావత్ వాణి (55) మృతి చెందింది. కాలనీవాసుల కథనం ప్రకారం.. గత నెల 31న రాత్రి కురిసిన వర్షానికి కాలనీలోని ఇండ్లలోకి వరదచేరింది. ఈ క్రమంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చి వాణి వరదలో కొట్టుకపోయింది. ఆమె భర్త జైరాం తన భార్యను కాపాడాలని కేకలు వేయడంతో అదే తండాకు చెందిన భద్రు అనే వ్యక్తి కాపాడాడు. రెండు రోజుల నుంచి ఇంట్లో ఉన్న వాణి అస్వస్థతకు గురై మంగళవారం మృతి చెందినట్లు కాలనీవాసులు తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

గూడూరు, సెప్టెంబర్ 3 : వర్షాల వల్ల పంటలు నష్టపోయిన తమను ఆదుకోవాలని పలువురు రైతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. మండలంలో పలు గ్రామాల్లో వరి, మక్కజొన్న, పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు వాపోతున్నారు. గుండెంగ గ్రామ పరిధి మంగ్యాతండాలో బదావత్‌పూల్ సింగ్‌కు చెందిన మక్కజొన్న, గూడూరులో వాంకుడోత్ సామ్యానాయక్‌కు చెందిన మిర్చి తోట దెబ్బతిన్నాయని తెలిపారు.

కందగిరిపై కూలిన ఆలయ శిఖరం

కురవి, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలకు కందగిరిపైన ఉన్న లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ శిఖరం కూలిపోయిం ది. గొర్లు, పశువుల కాపర్ల ద్వారా విషయం తెలుసుకున్న కందికొం డకు చెందిన సాగర్, నవీన్ తోపాటు మరికొందరు యువకులు మంగళవారం గుట్టపైకి ఎక్కారు. గుట్టపై ఆలయ శిఖరం కూలిపోవడమేకాకుండా గోడలు కూడా పాక్షికంగా బీటలు వారినట్లు తెలిపారు. ప్రతి కార్తీక పౌర్ణమి రోజున ఇక్కడ లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణ జాతర జరుగుతుంది. ఆలయాన్ని మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 3 : చిక్సి పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికారెడ్డి కథనం ప్రకారం.. వారం రోజుల క్రితం పట్టణంలోని రెడ్యానాయక్ కాలనీకి చెందిన ముత్యాల లక్ష్మి కొడుకు విజయ్(28) దవిచక్రవాహనంపై వెళ్తుండగా, చెన్నారావుపేటకు చెందిన లావుడ్యా శ్రీను బొలేరా వాహనంతో ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన విజయ్‌ని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బూర్లవాణి చెరువు కట్ట పక్కనే రైల్వే ట్రాక్, (ఇన్‌సెట్) చెరువు కట్టకు పడిన బుంగ

రైల్వే ట్రాక్‌కు పొంచి ఉన్న ప్రమాదం

కురవి, సెప్టెంబర్ 3 : మండలంలోని గుండ్రాతిమడుగు విలేజ్ గ్రామంలోని బూర్లవాణి పెద్దచెరువు కట్టకు మంగళవారం బుంగ పడింది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు అలుగుపోస్తుంది. అంతేకాకుండా పైభాగాన ఉన్న నారాయణపురం గ్రామంలోని శంభుని చెరువు అలుగు పోస్తుండడంతో నీరంతా బూర్లవాణి చెరువులోకి చేరుతున్నది. కాగా, ముదిరాజ్ కులస్తులు బుంగకు అడ్డంగా రాళ్లు, ఇసుక బస్తాలు వేసి పూడుస్తున్నారు. చెరువు కట్ట పక్కనే రైల్వే ట్రాక్ ఉన్నది. కట్ట తెగితే ట్రాక్ కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నది. ఇరిగేషన్ అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మొలకెత్తిన 20 క్వింటాళ్ల పెసళ్లు

సుమారు రూ.2లక్షలు నష్టపోయానని రైతు ఆవేదన

ఇనుగుర్తి, సెప్టెంబర్